రూ.750 కోట్లతో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి

'ఈనాడు'తో పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి



ముఖాముఖి

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రూ.750 కోట్లను కేటాయించామని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. ఇందులో రూ.500 కోట్లను ఒక్క రాష్ట్ర ప్రభుత్వమే ఇచ్చిందని, మిగిలిన నిధులు కేంద్రం ద్వారా వస్తున్నాయన్నారు. పలు చారిత్రక ప్రాంతాల్లో ఇప్పటికే ఈ నిధులతో పలు పనులు మొదలయ్యాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధిని గత భారాస ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆయన 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

రూ.100 కోట్లతో సాగర్ అభివృద్ధి..

◆ నాగార్జునసాగర్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.100 కోట్లను కేటాయించాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టితో ఈ ప్రాంతాన్ని పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి చేస్తున్నారు. బుద్ధవనం, ప్రాజెక్టులో ద్వీపంగా ఉన్న చాకలిగట్టును ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందించాం. ఈ (చాకలిగట్టు)ద్వీపానికి చేరుకునేందుకు తీరం నుంచి ప్రత్యేకంగా బోట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

◆ సాగర్‌కు వచ్చే పర్యాటకుల కోసం ప్రస్తుతమున్న విజయ్‌విహార్ హోటల్‌ను విస్తరించడంతో పాటూ మరో రెండు హోటళ్లను ఏర్పాటు చేయనున్నాం. బుద్ధవనంలోనూ త్వరలోనే మూడు నక్షత్రాల హోటల్ రాబోతోంది. సాగర్ ప్రాజెక్టుతో పాటూ వెనక జలాలు ఉన్న వైజాగ్‌కాలనీని సైతం పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం. ఇక్కడ ఏకో టూరిజంతో పాటూ కాటేజీల నిర్మాణం, వ్యూ పాయింట్‌లను ఏర్పాటు చేస్తాం. ఏడాదిలోపు ఈ పనులన్నీ పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం.

వచ్చే నెలాఖరులోగా రోప్‌వే టెండర్లు..

❑ భువనగిరి కోటపైకి రోప్‌వేను ఏర్పాటు చేయడానికి రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నాం. అక్టోబరు నెలాఖరులోపు టెండర్ల ప్రక్రియ పూర్తై పనులు ప్రారంభం కానున్నాయి. కోట కింద ఇన్నాళ్లు భూ సమస్య ఉండటంతో రోప్‌వే ఏర్పాటులో జాప్యం జరిగింది. దాన్ని త్వరలోనే పరిష్కరిస్తాం. కింద ఫుడ్‌కోర్టులతో పాటూ పర్యాటకులకు వసతి, బస కల్పించేందుకు వీలుగా హోటళ్ల నిర్మాణం చేయాలనే ఆలోచన ఉంది.

ఆధ్యాత్మిక సర్క్యూట్‌గా యాదాద్రి..

భువనగిరి, యాదాద్రి, కొలనుపాక, రాజపేటను కలుపుతూ పర్యాటక, ఆధ్యాత్మిక సర్క్యూట్‌గా ఏర్పాటు చేస్తాం. అందుకు ప్రతిపాదనలన్నీ సిద్ధమయ్యాయి. హైదరాబాద్‌తో పాటూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఈ సర్క్యూట్‌ను వీక్షించేందుకు ప్రత్యేకంగా ప్యాకేజీలు నిర్ణయిస్తాం. దీని వల్ల ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటాం.

ఆదాయ మార్గాలపై అన్వేషణ

ఉమ్మడి నల్గొండ జిల్లాలో కృష్ణా పరివాహక ప్రాంతాలతో పాటూ రాచకొండ గుట్టలను అభివృద్ధి చేస్తే పర్యాటకులు పెరిగి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే వీలుండేది. గత పదేళ్ల ఈ ప్రాంతాలను నిర్లక్ష్యం చేశారు. చారిత్రక కట్టడాలతో పాటూ పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ప్రతి ప్రాంతానికో నివేదికను తయారు చేస్తున్నాం. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే ప్రాంతాలపై మొదట దృష్టి పెట్టాం.

- ఈనాడు, నల్గొండ:

యువజనోత్సవాలకు దరఖాస్తు చేసుకోండి

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: యువజన సర్వీసుల శాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అక్టోబరు 1 నుంచి జిల్లా స్థాయిలో యువజనోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి రామచందర్‌రావు గురువారం తెలిపారు. పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 15 నుంచి 29 సంవత్సరాల యువత పేరు, వయస్సు, పుట్టిన తేదీ, చిరునామా, ఫోన్ నెంబర్, ప్రదర్శన పేరు వివరాలతో ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇసుక విధానం అమలుకు చర్యలు

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'మన ఇసుక వాహనం' విధానం ద్వారా గృహ వినియోగ అవసరాల కోసం సరైన ధరలకు ఇసుక అందించేందుకు జిల్లాలో ఇసుక విధానం అమలు చేయనున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం చేకూరడం, స్థానికులకు ఉపాధి లభించడంతోపాటు తక్కువ ధరకు సులువుగా ఇసుక లభిస్తుందని పేర్కొన్నారు. గృహ అవసరాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నట్లయితే ట్రాక్టర్ల ద్వారా ఇసుక పొందొచ్చని వివరించారు. ఆన్‌లైన్‌లో ట్రాక్టర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై తహసీల్దార్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

నడిపించేవారు లేక.. నరకయాతన..!

● వైద్యులు, ఆపరేటర్లు లేక మూలకు పడ్డ యంత్రాలు

పరిశీలన

ఈనాడు, నల్గొండ - న్యూస్‌టుడే, నల్గొండ అర్బన్, సూర్యాపేట (తాళ్లగడ్డ), భువనగిరి గంజ్: రోగులకు కార్పొరేట్ వైద్యం అందించాల్సిన జిల్లా ప్రధాన ఆసుపత్రుల్లో అజమాయిషీ లేకపోవడంతో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ.లక్షల విలువైన పరికరాలున్నా వాటిని నిర్వహించే వైద్యులు, ఆపరేటర్లు లేకపోవడంతో అవి మూలకుపడ్డాయి. నల్గొండ, సూర్యాపేట, భువనగిరిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రు(జీజీహెచ్)లను 'ఈనాడు' గురువారం పరిశీలించగా.. పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.



నల్గొండ: రక్తనమూనాల పరీక్షల కేంద్రం వద్ద ఇలా..



సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం వద్ద రోగుల రద్దీ

నల్గొండ జీజీహెచ్‌లో...

☛ గుండె రోగులను పరిశీలించే 2డీ ఇకో, ఈసీజీ మిషన్లు పనిచేయడం లేదు. గుండె సంబంధిత వైద్యుడు (కార్డియాలజిస్టు) లేకపోవడంతో వీటిని పట్టించుకునేనాథుడు లేదు. దీంతో రూ.లక్షల విలువైన పరికరాలు వృథాగా పడి ఉన్నాయి.

☛ ఆపరేషన్ల సమయంలో మనిషి ఎక్స్‌రే ఫొటోలను కచ్చితంగా గుర్తించే సీ - ఆర్మ్ మిషన్ నిరుపయోగంగా మారింది. సుమారు రూ.13 లక్షలకు పైగా విలువ చేసే మిషన్ పనిచేయకపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

☛ ఆసుపత్రిలో ప్రస్తుతం అంతా ఇన్‌ఛార్జుల పాలనే సాగుతోంది. గత ఏడు నెలల్లో నలుగురు సూపరింటెండెంట్లు మారగా.. వైద్య కళాశాల ప్రిన్సిపళ్లు సైతం ముగ్గురు మారారు. ఆసుపత్రిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన ఆర్ఎంవోలు మొత్తం 8 మంది ఉండాల్సి ఉండగా..ఐదుగురు మాత్రమే ఉన్నారు.

☛ కీలకమైన డయాలసిస్ కేంద్రంలో మూత్రపిండాల నిపుణులు లేరు. ప్రస్తుతం సాంకేతిక నిపుణుడితోనే ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.

☛ మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఓపీకి వచ్చే సామాన్యులంతా బయట ప్రైవేటు మెడికల్ దుకాణాల్లోనే మందులు కొనుగోలు చేస్తున్నారు.

☛ మందుల సరఫరాతో పాటూ రోగులకు భోజనం అందించే కాంట్రాక్ట్ కాలపరిమితి ముగిసి మూడు నెలలు గడిచినా కొత్తగా టెండర్లు పిలవడం లేదు.

☛ ఇటీవల జరిగిన బదిలీల అనంతరం వైద్య, విద్య సంచాలకుల పరిధిలో మొత్తం 77 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం కేవలం 33 మందే ఉన్నారు. మిగిలిన 44 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

☛ వైద్య విధాన పరిషత్‌లో సివిల్ సర్జన్ స్పెషలిస్టులు 62 ఉండాలి. కానీ ప్రస్తుతం 39 మంది ఉండగా.. 23 ఖాళీలున్నాయి. డిప్యూటీ సివిల్ సర్జన్‌లు 34 మంది ఉండాల్సింది..ప్రస్తుతం 8 మంది ఉండగా. .26 ఖాళీలున్నాయి. సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 121 గానూ ప్రస్తుతం 21 మందే ఉండగా... 100 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

భువనగిరిలో...

◆ భువనగిరిలో గత ప్రభుత్వం వైద్యకళాశాలను ఏర్పాటు చేయగా.. ఇటీవల అనుమతులు వచ్చాయి. మొత్తం 220 పడకలు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 100 పడకలే ఉన్నాయి. ఇప్పుడున్న భవనాలపైనే మరికొన్నింటినీ నిర్మిస్తున్నారు.

◆ ఇక్కడ కాన్పులకు సంబంధించిన శస్త్రచికిత్సలు మాత్రమే కొనసాగుతున్నాయి. ఇతర అత్యవసర సేవలు అందుబాటులో లేవు. దీంతో ఇక్కడకు వచ్చిన రోగులను హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియాలకు పంపుతున్నారు. ఇందులో జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగిన వారే ఎక్కువగా ఉన్నారు.

◆ వైద్య కళాశాల నిర్మాణానికి యాదగిరిగుట్ట పురపాలిక పరిధిలో 20 ఎకరాలకు కేటాయించారు. పనులు జరగాల్సి ఉంది.

◆ జిల్లా ఆసుపత్రి నుంచి వైద్యకళాశాలగా మారడంతో వైద్యులు సరిపడనంత మంది ఉన్నారు. ఆపరేషన్లకు సదుపాయాలు లేకపోవడంతో ఉన్నవారూ సర్జరీలు చేయడానికి వీలు పడటంలేదు.

సూర్యాపేటలో...

❑ సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రూ.లక్షలు విలువ కలిగిన యంత్రాలు అందుబాటులో ఉన్నప్పటికీ.. అర్హత కలిగిన సిబ్బంది లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. రొమ్ము కాన్సర్‌ను నిర్ధారించే మమోగ్రాఫ్ యంత్రం ఉన్నప్పటికీ దానిని నిర్వహించే నిపుణుడైన ఆపరేటర్‌లేకపోవడంతో అది మూలకు చేరింది. గుండె సంబంధిత నిపుణుడైన వైద్యుడితో పాటూ నెఫ్రాలజీ వైద్యులు లేరు. రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా చితికిపోతున్నారు.

❑ మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. వైద్యులు రాసిచ్చిన మందుల చిట్టీని ఫార్మసీలో అందిస్తే ఎరుపురంగు పెన్నుతో టిక్‌పెట్టి అవి బయట తాము చెప్పిన మందుల దుకాణంలోనే తీసుకోవాలని రోగులకు చెబుతున్నారు. రక్త పరీక్ష కేంద్రాల్లో నమూనాలు సేకరించేందుకు అవరమయ్యే సిరంజీలూ అందుబాటులో లేవు.

❑ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు శస్త్రచికిత్స చేయాలంలే రోగులే సిరంజీలు, చేతి గ్లౌజులు, కావాల్సిన మందులను సమకూర్చుకోవాల్సి వస్తోంది.ఇటీవల బదిలీలు జరగడంతో సీనియర్ వైద్యులంతా వెళ్లిపోగా.. జూనియర్ వైద్యులతోనే ప్రస్తుతం నెట్టుకొస్తున్నారు.

మహిళలు సంఘటితమయ్యేలా కార్యాచరణ



సూర్యాపేటలో సమావేశమైన మహిళా పొదుపు సంఘాల సభ్యులు

పురపాలికల వారీగా మహిళా పొదుపు సంఘాల వివరాలు

పురపాలిక	మహిళా సంఘాలు	సభ్యులు
సూర్యాపేట	2581	24,260
కోదాడ	1393	13,858
హుజూర్‌నగర్	770	7517
నేరేడుచర్ల	404	3663
తిరుమలగిరి	409	3203

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: పురపాలికల్లో మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. పట్టణాల్లో నివసించే ప్రతి మహిళా సంఘంలో చేరి పొదుపు చేసేలా చర్యలు తీసుకుంటోంది. ఇందుకు పురపాలికల్లో వార్డుల వారీగా సర్వే చేసి అర్హులైన కొత్త సభ్యులను గుర్తించి అక్టోబరు 13 వరకు అందరికీ సభ్యత్వం ఇప్పించనున్నారు.

వార్డుకో ఆర్పీ నియామకం

సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి పురపాలికలుండగా.. మొత్తం 141 వార్డులు ఉన్నాయి. మెప్మా ఆధ్వర్యంలో ఆర్పీలు, సీవోలు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిపై పర్యవేక్షణకు జిల్లా మెప్మా సమన్వయకర్త ఉంటారు. ప్రస్తుతం వార్డుకు ఒకరు చొప్పున ఆర్పీని నియమించారు. ఇంటింటికీ సిబ్బంది వచ్చి సర్వే చేపడతారు. స్వయం సహాయక సంఘాల్లో చేరని వారి వివరాలు సేకరిస్తారు. పొదుపు సంఘాల్లో చేరకపోవడానికి కారణాలు తెలుసుకుంటున్నారు. ఇలా క్షేత్రస్థాయిలో సభ్యులను గుర్తించి సంఘంలో చేర్పిస్తున్నారు.

అర్హులు తప్పక చేరాలి

–శ్వేత, టీఎంసీ, సూర్యాపేట

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వార్డుల్లో ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. అక్టోబరు 13 వరకు సంఘంలో చేరడానికి అవకాశం ఉంది. అర్హులైన మహిళలు పొదుపు సంఘాల్లో చేరాలి.

నీటి సహాయకులొస్తున్నారు..!



సూర్యాపేట: ఎంపికైన గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

భానుపురి, న్యూస్‌టుడే: పల్లెల్లో నీటి ఇబ్బందులు తీర్చడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే పరిష్కారం చూపేందుకు కసరత్తు చేస్తోంది. గ్రామాల్లో బోర్లు, మోటార్లు మరమ్మతుకు గురైై క్షణాల్లో బాగుచేయించేలా, పైపులైన్ల లీకేజీలను సవరించేలా గ్రామ మంచినీటి సహాయకులను నియమించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'నల్ జల్ మిత్ర' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ప్రతి గ్రామానికి ఒకరు చొప్పున మేజర్ పంచాయతీలో ఇద్దరు, ముగ్గురు వరకు సహాయకులను నియామకం చేపట్టి శిక్షణ ఇస్తోంది.

552 మంది నియామకం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లాలో మొత్తం 475 గ్రామాలు ఉండగా 552 మంది గ్రామ మంచినీటి సహాయకులను అధికారులు నియమించారు. ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై, స్థానికంగా ఉంటూ, వయస్సు 45 ఏళ్లకు మించని వారిని ఎంపికచేశారు. వీరు ఆయా గ్రామాల్లో చేతి పంపులు, మోటార్ల మరమ్మతులు, పైపులైన్ల లీకేజీలను అరికట్టడం, మంచినీటి నాణ్యత పరిశీలన, ట్యాంకులను శుభ్రపరచడం వంటి పనులు చేయనున్నారు. ఇందుకు ఖర్చులను పంచాయతీ నిధుల నుంచి భరించాల్సి ఉంటుంది. గ్రామ సహాయకుల్లోంచి మాస్టర్ ట్రైనీలను గుర్తించి వీరికి హైదరాబాద్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఆ మాస్టర్ ట్రైనీలు జిల్లాలో అక్టోబరు 24 వరకు మిగతా సహాయకులకు శిక్షణ ఇచ్చి క్షేత్రస్థాయిలో ఎలా పనిచేయాలో సూచనలు ఇస్తారు.

సత్వరమే పరిష్కారానికి అవకాశం

–వెంకటేశ్వర్లు, ఎస్ఈ, మిషన్ భగీరథ, నల్గొండ

గ్రామాల్లో ఏమైనా మోటార్లు, బోర్లు మరమ్మతుకు గురైతే వెంటనే మంచినీటి గ్రామ సహాయకులు మరమ్మతు చేపట్టి వినియోగంలోకి తీసుకొస్తారు. ఏ చిన్న తలెత్తినా వెంటనే పరిష్కరిస్తారు.

సద్దుల చెరువు కట్ట కింద ఇళ్ల పరిశీలన

భానుపురి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో అక్రమ కట్టడాలను గుర్తించి కూల్చివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అక్కడ ఇప్పటికే పలు అక్రమ కట్టడాలను కూల్చివేశారు. సూర్యాపేట జిల్లాలోనూ రెండ్రోజుల నుంచి అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఏమైనా నిర్మాణాలు ఉన్నాయా అని నీటి పారుదల శాఖ, మున్సిపల్, రెవెన్యూ అధికారులు తనిఖీలు జరుపుతున్నారు. సూర్యాపేట పట్టణంలో సద్దుల చెరువు పరిధిలోని నెహ్రూనగర్‌లో అధికారులు గురువారం పరిశీలనకు వెళ్లగా.. తమ ఇళ్లు పోతాయేమోనని కొంతమంది స్థానికులు భయభ్రాంతులకు గురై అడ్డుకున్నారు. కాలనీలో ఎందుకు పర్యటిస్తున్నారని ప్రశ్నించారు. సద్దుల చెరువు కట్ట కింద కొన్నేళ్ల నుంచి నివాసముంటున్నామని, తమ ఇళ్లను కూల్చి వేయొద్దని, ఇన్ని రోజులు లేని సమస్య ఇప్పుడెందుకు వచ్చిందని నిలదీశారు. తమ ఇళ్లను కూల్చివేస్తే ఎలా బతకాలని పలువురు స్థానికులు కంటతడి పెట్టుకున్నారు. ఒక్కసారిగా కాలనీవాసులు రావడంతో ఆయా శాఖల అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.



నెహ్రూనగర్‌లో వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

ఆందోళన చెందొద్దు: –వేణుమాధవ రావు, ఆర్డీవో, సూర్యాపేట

నెహ్రూనగర్ కాలనీ వాసులు ఆందోళన చెందొద్దు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయో లేవో పరిశీలన మాత్రమే చేస్తున్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదు.

చాకలి ఐలమ్మ ఆశయాలు నేటితరానికి స్ఫూర్తి: కలెక్టర్



కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, తదితరులు

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్యభూమిక పోషించిన వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలిసి కలెక్టర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్.లత, సంక్షేమ శాఖ అధికారులు శంకర్, లత, చాకలి ఎస్సీ సాధన సమితి జిల్లా అధ్యక్షుడు ఉపేందర్, రజక సంఘం అధ్యక్షుడు గుండారపు శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక బృందాలు

సూర్యాపేట కలెక్టరేట్: జిల్లాలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, నివారణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఎస్పీ సన్ ప్రీత్ సింగ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాలో 37 బ్లాక్ స్పాట్లు, 22 హాని జరిగే ప్రదేశాలు గుర్తించామని, ఆయా ప్రదేశాల్లో సైన్ బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని వెల్లడించారు. ప్రమాద పరిష్కార బృందాలను ఏర్పాటు చేస్తామని, ఇందులో ఒక పోలీస్ అధికారి, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, ఎన్‌హెచ్‌ఏఐ, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారులు, డిపో మేనేజర్, పుర కమిషన్, మండల స్థాయి అధికారులు ఉంటారని వివరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పట్టణ, ఇతర రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్.లత, ఎన్‌హెచ్ఐ 365 బీబీ డిప్యూటీ మేనేజర్ రాహుల్, ఎన్‌హెచ్ 65 మేనేజర్ టెక్ రాధాశ్యాం షైనీ, ఆర్డీవో వేణుమాధవ్, పుర కమిషనర్లు శ్రీనివాస్, రమాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, ఇంట్రా ఈఈ శ్రీనివాసరావు, రవాణా శాఖ అధికారి సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

కుడకుడరోడ్డు(సూర్యాపేట): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించే బోధన, పౌష్టికాహారం వల్ల భవిష్యత్తులో పిల్లలు ఆరోగ్యవంతంగా ఉండి, అన్ని రంగాల్లో పోటీ పడతారని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. పోషణ మాసంలో భాగంగా పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం సామూహిక అన్నప్రాశన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో నర్సింహారావు, సీడీపీవో సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు యూరియా అమ్మితే చర్యలు: డీఏవో

మునగాల, న్యూస్‌టుడే: ఎరువుల దుకాణదారులు యూరియాను అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని డీఏవో శ్రీధర్‌రెడ్డి అన్నారు. మునగాల, నారాయణగూడెంలోని ఎరువుల దుకాణాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. దుకాణాల్లో స్టాక్ బోర్డులు ప్రదర్శించాలన్నారు. నాణ్యమైన పురుగు మందులను విక్రయించాలన్నారు. ఎరువుల దుకాణాల్లో, సొసైటీల్లో యూరియా అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ యల్లయ్య, ఏఈవోలు నాగులు, రమ్యతేజ తదితరులు పాల్గొన్నారు.

పల్లె గల్లా.. ఖాళీ..!





నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలను నిధుల కొరత వేధిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని నెలలుగా పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. ముఖ్యంగా ఆదాయ వనరులు అంతగా లేని చిన్న పంచాయతీల్లో కనీసం కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి. గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛదనం- పచ్చదనం, త్వరలో నిర్వహించే బతుకమ్మ, దసరా పండగ సంబరాలకు నిధుల లేమి సమస్యగా మారనుందని పంచాయతీ కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



జిల్లా	పంచాయతీలు	మండలాలు	చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు (సుమారు)
నల్గొండ	868	33	రూ. 45 కోట్లు
సూర్యాపేట	486	23	రూ. 20 కోట్లు
యాదాద్రి	428	17	రూ. 14 కోట్లు

గాడితప్పిన పాలన..

గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం ఫిబ్రవరి 2న ప్రత్యేకాధికారులను నియమించింది. నిధుల లేమి, సిబ్బంది జీతాల చెల్లింపుల్లో జాప్యం కారణంగా పంచాయతీ పాలన గాడితప్పుతోంది. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మురుగు కాలువల్లో పూడికతీత, విద్యుత్తు దీపాల ఏర్పాటు, తాగునీటి పైప్‌లైన్‌ల లీకేజీలు, ట్రాక్టర్లకు డిజిల్ కొరత ఇలా.. అనేక సమస్యలు రాజ్యమేలుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. ప్రత్యేకాధికారులు సైతం చేసేదేమీ లేక పంచాయతీలను పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

జాడలేని ఎస్ఎఫ్‌సీ నిధులు

ఈ ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు కొద్ది మేర గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమయ్యాయి. వాటితో పంచాయతీ కార్యదర్శులు కొన్ని నెలలుగా నెట్టుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎస్ఎఫ్‌సీ (స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్) నిధులు సైతం గత కొన్ని నెలలుగా విడుదల కాలేదు. గతంలో సర్పంచులు గ్రామాల్లో చేసిన పనులకు సైతం బిల్లులు చెల్లించాల్సి ఉంది.

✦ బ్లీచింగ్, వీధిలైట్లు, చేతిపంపుల సామగ్రి కొనుగోలు, పంచాయతీ నిర్వహణ ఖర్చులు ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ప్రత్యేకాధికారులు పంచాయతీ పాలనను పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో పూర్తిస్థాయిలో బాధ్యతలు పంచాయతీ కార్యదర్శులపై పడటంతో వారు అప్పులు చేసి పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

మానసిక ఉల్లాసం.. విజ్ఞాన వికాసం

శివలింగంపై.. నేరుగా సూర్యకిరణాలు



నేరేడుచర్ల: చారిత్రక భృగుమాలికా సోమేశ్వరాలయం

కాకతీయులు, రెడ్డిరాజుల పూజలందుకున్న చారిత్రక సోమప్ప దేవాలయం ఎన్నో ప్రత్యేకతలకు నిలయం. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం సోమారం, బూర్గులతండా గ్రామపంచాయతీల పరిధిలో మూసీనది తీరంలో ఉన్న ఈ ఆలయంలో ఏటా రెండు, మూడు రోజుల పాటు సూర్యకిరణాలు శివలింగంపై పడతాయి. ఈ ఆలయం వద్ద పెద్ద సొరంగ మార్గం ఉంది. అది శ్రీశైలం దాకా ఉందని చెబుతారు. ఆలయం రాతి స్తంభాలతో అద్భుత నిర్మాణశైలితో నిర్మితమైంది. ఆలయం ఎదుట నిర్మించిన ముఖద్వారం ఆకర్షణీయంగా కన్పిస్తుంది. 13వ శతాబ్దంలో దేవనాగరి లిపిలో రాజులు వేసిన ఆరు శిలా శాసనాలు కన్పిస్తాయి.

కల్పించాల్సిన సదుపాయాలు..

మూసీనదిలో భక్తులు పుణ్యస్నానాలు చేయడానికి ఘాట్ నిర్మించాలి. మిర్యాలగూడ నుంచి చిల్లేపల్లి మీదుగా సూర్యాపేట వెళ్లే రోడ్డును ఇప్పటికే డబుల్ రోడ్డుగా మారుస్తున్నారు. ఈ మార్గంలో బూర్గులతండా నుంచి 2 కిలోమీటర్ల దూరంలో సోమప్ప దేవాలయం ఉంది. ఈ రెండు కిలోమీటర్లు రెండు వరుసల తారు రోడ్డు నిర్మించాలి. ఆలయం వద్ద భక్తులకు మరికొన్ని మెరుగైన వసతులు కల్పించాలి. – న్యూస్‌టుడే, నేరేడుచర్ల, చిలుకూరు

❑ నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



పర్యాటక ప్రదేశాల సందర్శనలో ఎంజీయూ విద్యార్థులు

పర్యాటక రంగానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. పర్యాటక ప్రదేశాలను సందర్శించడం ద్వారా మానసిక ఉల్లాసం పొందడంతో పాటుగా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. సందర్శించే ప్రాంతాల్లోని ప్రజల సంస్కృతి, జీవనోపాధి తెలుసుకోవచ్చు. దేశంలోని ఆయా రాష్ట్రాల్లో రోజురోజుకి పర్యాటక రంగ అభివృద్ధి ఎంతో ముందుకెళ్తుంది. ఇంతటి ప్రాధాన్యతా రంగంపై నేటి యువత ఆసక్తి చూపుతున్నారు. పీజీ స్థాయిలో టూరిజం కోర్సులు పూర్తిచేసి అందివస్తున్న ఉపాధి అవకాశాలను పొందుతున్నారు. ప్రధానంగా పర్యాటక ప్రదేశాల్లోని హోటల్స్ మేనేజర్లుగా, టూర్ గైడ్‌లుగా, టూర్ ఆపరేటర్లుగా, ఈవెంట్ మేనేజర్లుగా, టూరిజం శాఖలో ఆయా కొలువులు సాధించి స్థిరపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రదేశాల్లో ఏటా సందర్శకుల సంఖ్య పెరుగుతూ వస్తోంది.

–నల్గొండ టౌన్, న్యూస్‌టుడే:

పర్యాటక రంగానికి ప్రాధాన్యం

మారం వెంకటరమణారెడ్డి,

ఎంజీయూ ఎంబీఏ టీటీఎం హెచ్‌వోడీ




పర్యాటకరంగానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో పర్యాటకరంగం ఎంతో అభివృద్ధి సాధిస్తుంది. వర్సిటీలో ఎంబీఏ టీటీఎం కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఆయా పర్యాటక సంస్థల్లో మంచి ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ కోర్సు చదివేందుకు మక్కువ చూపాలి. నల్గొండ జిల్లాలో మంచి పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వాటిని అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య పెరగడంతో పాటుగా యువతకు ఉపాధి లభిస్తుంది.

ఎంజీయూలో టూరిజం కోర్సు

ఎంబీఏ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ కోర్సు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక్క ఎంజీయూలోనే ఉంది. ఇక్కడ ప్రతి ఏటా 60 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందుతారు. కోర్సును వర్సిటీలో 2009లో ప్రారంభించారు. ఇప్పటి వరకు 12 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు ఈ కోర్సు పూర్తిచేసి టూరిజం పరిధిలోని ఆయా సంస్థల్లో కొలువులు చేస్తున్నారు. మరికొందరూ సొంతంగా టూరిజం కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో చూడదగ్గ ప్రదేశాలు



పిల్లలమర్రి ఎరకేశ్వర ఆలయం

భువనగిరి కోట, యాదాద్రి క్షేత్రం, కొలనుపాక జైన దేవాలయం, ఫణిగిరి బౌద్ధ స్థూపం, పిల్లలమర్రి ఎరకేశ్వర ఆలయం, మట్టపల్లి, మేళ్లచెరువు, జాన్‌పహాడ్ ఆధ్యాత్మిక క్షేత్రాలు, వాడపల్లి శివాలయం, పానగల్ ఛాయా సోమేశ్వరాలయం, వైజాగ్ కాలనీ, నాగార్జునసాగర్, బుద్ధవనం, దేవరకొండ కోట, బుగ్గ జలపాతాలు జిల్లాలో తప్పకుండా చూడాల్సిన ప్రాంతాలు.

✦ గత మూడేళ్లలో ఉమ్మడి జిల్లాలోని బుద్ధవనం, ఫణిగిరి, భువనగిరి కోటకు సుమారు రూ.400కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. యాదాద్రి క్షేత్రానికి సమీపంలోని బస్వాపూర్ రిజర్వాయర్‌ను సైతం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

కొత్త అందాలు తెరపైకి:

నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం అజలాపురం గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో పచ్చని కొండల నడుమ కొన్నేళ్ల క్రితమే తెరపైకి వచ్చిన బుగ్గ జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది. నల్గొండ నయాగారాగా పేరు గాంచిన ఈ జలపాతం వర్షాలు పడే సమయంలో ప్రజలకు కనువిందు చేస్తుంది. వాడపల్లిలో పురాతన శివాలయం, సమీపంలోని కృష్ణా, మూసీ నదుల సంగమ ప్రాంతం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటుంది.

ఆధ్యాత్మిక క్షేత్రాలు..

ఆలేరు సమీపంలోని పురాతన కొలనుపాక జైన దేవాలయం నుంచి సూర్యాపేట జిల్లాలోని బౌద్ధ మత ఆనవాళ్లకు నిలయంగా ప్రసిద్ధి గాంచిన ఫణిగిరి బౌద్ధ క్షేత్రం, పురాతన శివాలయం దర్శనంతో పాటు ప్రకృతి అందాల పిల్లలమర్రి ఎరకేశ్వర ఆలయం, మట్టపల్లి, మేళ్లచెరువు, జాన్‌పహాడ్ ఆధ్యాత్మిక క్షేత్రాలు సైతం జిల్లాలో చూడదగ్గ ప్రదేశాలు.

– న్యూస్‌టుడే, మిర్యాలగూడ పట్టణం

ఉమ్మడి జిల్లాలో..

కొలనుపాక జైన మందిరం, మ్యూజియం, దేవరకొండ, రాచకొండ కోటలు, నాగార్జున సాగర్, బుద్ధవనం, పచ్చల, ఛాయ సోమేశ్వర ఆలయం పానగల్లు, ఇలా మరిన్ని పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వీటి సందర్శనకు యేటా వేలాది మంది ఆయా ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఈ ప్రదేశాల్లో టూర్ గైడ్‌లుగా పనిచేసే అవకాశం ఆసక్తి గల యువత లభిస్తాయి.

ఇష్టంతో చదువుతున్నా



మనీషా, ఎంజీయూ విద్యార్థిని

నేను ప్రస్తుతం ఎంజీయూలో ఎంబీఏ టీటీఎం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. ఎంతో ఇష్టంతో ఈ కోర్సు చదువుతున్నా. కోర్సులో చేరిన నాటి నుంచి పర్యాటరంగంపై ఎంతో అవగాహన పొందాను. వివిధ రాష్ట్రాల్లోని పర్యాటక ప్రదేశాలను వీక్షించి అక్కడి సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకున్నాను. కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు ఎన్నో కొత్త విషయాలపై విజ్ఞానాన్ని పెంపొందించుకున్నాను.

కాలువలో గల్లంతైన వారిలో ఒకరి మృతదేహం లభ్యం

నిడమనూరు, న్యూస్‌టుడే: సాగర్ ఎడమ కాలువలో దుస్తులు ఉతకడానికి వెళ్లి త్రిపురారానికి చెందిన కూరగాయల దుకాణం యజమాని వేమవరపు సాయి(25), ఆ దుకాణంలో పనిచేసే మేదరి శైలజ (24) ప్రమాదవశాత్తు బుధవారం కాలువలో పడి గల్లంతయ్యారు. గల్లంతైన ఇద్దరిలో ఒకరైన శైలజ మృతదేహం గురువారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో త్రిపురారం మండలం కంపసాగర్ వద్ద లభ్యమైంది. ఆమె మృతదేహం తేలి నీటిలో కొట్టుకుపోతున్న విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి బయటకు తీయించారు. మరో వ్యక్తి సాయి ఆచూకీ ఇంత వరకు లభ్యం కాలేదు.



☛ కాలువలో బుధవారం గల్లంతైన వేమవరపు సాయి, మేదరి శైలజ ఆచూకీ గురువారం మధ్యాహ్నం వరకు లభ్యం కాకపోవడంతో, కాలువకు నీటి విడుదల నిలిపి వేయాలని వారి బంధువులు మొదట ముకుందాపురం వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. పోలీసులు వారితో మాట్లాడి ధర్నా విరమింపజేశారు.

అమ్మ కావాలి..

త్రిపురారం: అమ్మ కావాలి.. అంటూ బోరున విలపిస్తున్న ముగ్గురు చిన్నారులను చూసి కంటతడి పెట్టని వారు ఎవరూ ఉండరు. శైలజకు ముగ్గురు కుమార్తెలు. మేదరి అని (12) 7వ తరగతి, మిల్కి(10) 6వ తరగతి, జ్యోష్ణ ప్రియ (8) 4వ తరగతి చదువుతున్నారు. తల్లి మరణవార్త తెలియగానే వారు అమ్మ కావాలని బోరున విలపిస్తుండటంతో వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. విషయం తెలిసిన వారంతా పెద్ద సంఖ్యలో మృతురాలి ఇంటి దగ్గరికి చేరుకుని కన్నీటి పర్యంతమవుతున్నారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి

భూదాన్‌పోచంపల్లి:నీటిసంపులో పడి బాలుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని రామ్‌నగర్‌కాలనీలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై భాస్కర్‌రెడ్డి కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రంలోని పుట్నియా జిల్లా బర్వారా గ్రామానికి చెందిన అర్జున్‌దాస్ ఉపాధి నిమిత్తం పోచంపల్లిలో నివాసం ఉంటున్నాడు. గురువారం అర్జున్‌దాస్ పని నిమిత్తం బయటకు వెళ్లాడు. తల్లి నిద్రిస్తున్న సమయంలో కరణ్‌కుమార్(13నెలలు) సోదరుడితో కలిసి ఆడుకుంటూ ఇంటి ఆవరణలోని నీటిసంపులో పడి మునిగిపోయాడు. అదే సమయంలో పక్క ఇంట్లో అద్దెకు ఉంటున్న సంతోష్ ఇంటికి రావడంతో బాలుడి సోదరుడు సంపులో పడిపోయాడని తెలిపాడు. వెంటనే బాలుడిని సంపులో నుంచి తీయగా అప్పటికే మృతిచెందాడు. మృతదేహాన్ని మరణోత్తర నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



అదనపు కలెక్టర్ కాళ్లు మొక్కుతున్న రైతు అయిలయ్య

నియంత్రిక మంజూరు చేయాలని..

గుండాల, న్యూస్‌టుడే: లో ఓల్టేజీ కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని, నియంత్రిక మంజూరు చేయాలని ఏడాదిగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఓ రైతు జిల్లా అదనపు కలెక్టర్ కాళ్ల మీద పడిన ఘటన గురువారం గుండాల మండల తహసీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకుంది. అధికారులు కార్యాలయ సందర్శనకు వచ్చిన సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన రైతు గోపాల్‌దాసు అయిలయ్య లోఓల్టేజ్ విద్యుత్తు సమస్య ఉందని విద్యుత్తు అధికారులను సంప్రదించగా నియంత్రిక మంజూరుకు డీడీ చెల్లించాలని సూచించారు. డీడీ తీసి ఏడాది దాటినా నియంత్రికను మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నారని రైతు అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ కాళ్ల మీద పడి తన సమస్య వివరించారు. స్పందించిన అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. త్వరిత గతిన సమస్య పరిష్కరిస్తామని రైతుకు హామీ ఇచ్చారు.

బంగారం ఆశ చూపి.. రూ.లక్షలు కాజేసి

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: బంగారం ఆశ చూపి రూ.లక్షలు దోచుకుంటూ, పిల్లలు ఆడుకునే రూ.500 నోట్లను అమాయకులకు అంటగట్టి మోసం చేస్తున్న ముఠాను హుజూర్‌నగర్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

✧ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండలం మోదుగుండ్ల గ్రామానికి చెందిన సోదరులు నోముల ప్రకాష్, మత్స్యగిరి వ్యాపారంలో నష్టపోయారు. సులువుగా డబ్బులు సంపాదించాలని భావించి వారికి తెలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం అనుపాలేనికి చెందిన తాపీ మేస్త్రీ కొమెర రత్తయ్య అలియాస్ తిరుపతిరెడ్డి, బెల్లంకొండ మండలం మాసపాలెం కాలనీకి చెందిన బత్తుల రేణు, డేరంగుల కృష్ణవేణి మొత్తం ఐదుగురు కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరందరూ నకిలీ బంగారాన్ని అమ్మి డబ్బులు సంపాదించుకోవాలనుకున్నారు.

✧ ఈ క్రమంలో కొమెర రత్తయ్య, రేణు కలిసి సత్తెనపల్లిలో కొన్ని నకిలీ బంగారు బిస్కెట్లు తయారు చేయించారు. మునగాల మండలం నారాయణగూడెం గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గోపిరెడ్డి వెంకటరెడ్డిని ఈనెల 2న ప్రకాష్ కలిసి తన బంధువులు పాత ఇంటిని కూల్చివేస్తుండగా రెండు బంగారు బిస్కెట్లు దొరికాయని, వాటిని తక్కువ ధరకు తీసుకుందామని చెప్పి సాగర్ సిమెంట్ పరిశ్రమ మైన్స్‌కు వెళ్లే దారిలోకి తీసుకెళ్లాడు. రత్తయ్య నుంచి నకిలీ బంగారు బిస్కెట్లు తీసుకుందామని చెప్పి ప్రకాష్ తన వాటా కింద చిన్న పిల్లలు ఆడుకునే కాగితపు కరెన్సీతో వెళ్లి వెంకటరెడ్డి నుంచి రూ.7 లక్షలు తీసుకొని అతడికి బంగారం ఇవ్వకుండా పారిపోయారు. వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు మఠంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

✧ ఈ ముఠానే జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన మాతంగి శ్రీనుకు బంగారం ఆశ చూపి అతడిని హుజూర్‌నగర్ పట్టణానికి రమ్మని చెప్పి అతడి నుంచి రూ.10 వేలు తీసుకున్నారు. శ్రీనుకు కూడా బంగారం ఇవ్వకపోవడంతో 24న హుజూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఘటనలపై సీఐ చరమందరాజు విచారణ చేశారు. మాతంగి శ్రీనును గురువారం మఠంపల్లి రోడ్డులోని ఓ పెట్రోల్ బంకు వద్దకు డబ్బులు తీసుకొని వస్తే బంగారం ఇస్తామని చెప్పడంతో సీఐ సూచనల మేరకు ఉదయం డబ్బులతో వెళ్లగా.. అక్కడకు వచ్చిన నోముల ప్రకాష్ మత్స్యగిరి, కొమెర రత్తయ్యలు మాతంగి శ్రీనుకు నకిలీ బంగారం ఇస్తుండగా సీఐ చరమందరాజు సిబ్బందితో కలిసి పట్టుకున్నారు.

✧ పట్టుబడిన నేరస్థులు ఇచ్చిన సమాచారంతో కోదాడ పట్టణంలోని ఆర్‌కే లాడ్జిలో ఉన్న డేరంగుల కృష్ణవేణి, బత్తుల రేణులను పట్టుకున్నారు. వీరి నుంచి రూ.7 లక్షల నగదు, రెండు ద్విచక్రవాహనాలు, ఒక ఆటో, 9 చరవాణులను, చిన్నపిల్లలు ఆడుకునే 761 కాగితపు రూ.500 నోట్లు (రూ.3,80,500 విలువ), మూడు నకిలీ బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్సైలు ముత్తయ్య, నరేష్, ఏఎస్సై బలరాంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



నల్గొండ: అంబేడ్కర్ భవన్‌లో జర్నలిస్టుల వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

ప్రజాభిప్రాయం ప్రకారం వార్తలు రాయాలి

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజాభిప్రాయం ప్రకారం నిజ నిర్ధారణ చేసుకొని వార్తలు రాస్తే బాగుంటుందని జిల్లా అదనపు పాలనాధికారి పూర్ణ చంద్ర అన్నారు. నల్గొండలో గురువారం జర్నలిస్టులకు ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో పాల్గొని మాట్లాడారు. సంచలన వార్తలకి ప్రాధాన్యం ఇవ్వకుండా సమాజానికి అవసరమయ్యేవాటికి సముచిత స్థానం కల్పిస్తే సమాజ మార్పునకు నాంది కావొచ్చన్నారు. జర్నలిజంలో నిరంతరం మనల్ని మనం నవీకరించుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్ డిప్యూటీ ఎస్పీ టి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి రోజు సుమారు రూ.5,6 కోట్లలో సైబర్ మోసాల వల్ల నష్టపోతున్నారన్నారు. నేరాల్లో బాధితులు, నేరస్థులు ఉండేవారని.. కానీ ఇప్పుడు సైబర్ క్రైమ్‌లో నేరస్థులు ఎక్కడో ఉండి మనకు చేయాల్సిన నష్టం చేస్తూనే ఉంటారన్నారు. నష్టపోతున్నవారిలో ఉన్నత విద్యావంతులే 90 శాతానికి పైగా ఉన్నారన్నారు. ప్రతి జిల్లాలో సైబర్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పీఐబీ డిప్యూటీ డైరెక్టర్ మానస్ కృష్ణకాంత్, దిలీప్ కుమార్‌రెడ్డి, సైంటిస్ట్ జగదీష్ బాబు, జిల్లా ఫీల్డ్ పబ్లిసిటి అధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

28న ఉమ్మడి జిల్లాస్థాయి కుస్తీ పోటీలు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: నల్గొండ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 28న ఉమ్మడి అండర్-14, 17 బాలబాలికల జిల్లా స్థాయి కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

బీఈడీ ద్వితీయ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ రెండవ సెమిస్టర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. నల్గొండలో పలు పరీక్ష కేంద్రాలను ఎంజీయూ సీవోఈ ఉపేందర్‌రెడ్డి పరిశీలించారు. మొదటి రోజున పరీక్షకు 2469 మంది విద్యార్థులు హాజరయ్యారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

రజితది హత్యా..? ఆత్మహత్యా..?

గుర్రంపోడు, న్యూస్‌టుడే: గుర్రంపోడు మండలం ముల్కలపల్లి వివాహిత మృతి కేసులో కీలక మలుపులు వెలుగు చూస్తున్నట్లు తెలుస్తోంది. రజితది హత్యా, ఆత్మహత్యా అన్న సందేహాల మధ్య విచారణ చేపట్టిన జిల్లా పోలీసు ఉన్నతాధికారులు హత్యేనని నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఆగస్టు 29న రాత్రి ఇంట్లో ఉరివేసుకుని చనిపోయిన వివాహిత జాల రజిత కేసులో పోలీసులు తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనంతరం ఆత్మహత్యగా నమోదు చేయటంతో మృతురాలి బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న నిందితుల పేర్లను తొలగించిన పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు చోటు చేసుకున్నాయి. ఈ వ్యవహారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో జిల్లా ఎస్పీ స్పందించి ఈ ఘటనపై జిల్లా అదనపు ఎస్పీ రాములునాయక్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన విచారణలో పలు ఆసక్తికర అంశాలు వెలుగు చూస్తున్నట్లు చెబుతున్నారు. ఘటనాస్థలంలో మృతదేహం చూడగానే హత్యగానే భావించినప్పటికీ తర్వాత ఆత్మహత్యగా కేసు నమోదు చేయటం వెనుక ఎలాంటి అంశాలున్నాయన్న కోణంలో అదనపు ఎస్పీ విచారణను చేపట్టారు. భర్త ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న నలుగురిని విచారించడంతో ఆత్మహత్య కాదని నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా నిందితుల నుంచి స్థానిక పోలీసులకు పెద్దమొత్తంలో డబ్బు చేతులు మారినట్లు వచ్చిన ఆరోపణలపై దృష్టి సారించిన పోలీసు ఉన్నతాధికారులు నిజ నిర్ధారణకు వచ్చినట్లు భావిస్తున్నారు. త్వరలోనే విచారణను పూర్తి చేసి కీలక సూత్రధారుల గుట్టును బయటపెట్టేందుకు జిల్లా ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పదహారేళ్లకు.. సర్కారు కొలువులోకి..!

నల్గొండ విద్యావిభాగం, నడిగూడెం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2008లో నష్టపోయిన అభ్యర్థులకు ఒప్పంద పద్ధతిలో ఎస్జీటీలుగా నియమించేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో నష్టపోయిన వాళ్లు 391 మంది ఉన్నారు. దాదాపు 16 ఏళ్ల తరువాత సమస్య పరిష్కారం అయింది. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో డీఎస్సీ- 2008 అభ్యర్థులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ఒప్పంద విధానంలో నెలకు రూ.31,080 వేతనం చొప్పున చెల్లించి ఎస్జీటీ ఉద్యోగాలు ఇచ్చేందుకు నిర్ణయించింది.

✦ బాధితులు ఉమ్మడి నల్గొండ జిల్లాలో 391 మంది ఉన్నా.. ఆ తర్వాత జరిగిన డీఎస్సీ, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో ప్రస్తుతం 270 మంది వరకు మిగిలి ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. చాలా మంది వివిధ పనులు, వ్యాపారాల్లో నిమగ్నమయ్యారు. 1967-69 మధ్య కాలంలో పుట్టిన వాళ్లు కూడా ఈ డీఎస్సీ రాశారు. ఇప్పటికే వారిలో కొంత మందికి 57 ఏళ్లు దాటాయి. ఎక్కువ మంది 50 ఏళ్ల వయస్సుకు దగ్గర్లో ఉన్నవాళ్లే ఉద్యోగంలో చేరనుండటం గమనార్హం.

నేటి నుంచి పత్రాల పరిశీలన..


డీఎస్సీ- 2008 అభ్యర్థులను ఒప్పంద పద్ధతిలో నియమించేందుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీచేసినట్లు డీఈవో బి.భిక్షపతి తెలిపారు. సంబంధిత అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు పాఠశాల విద్యా తెలంగాణ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూస్కూల్ ఎడ్యు.తెలంగాణ.జీవోవి.ఇన్ నందు దరఖాస్తు ఫారం, అభ్యర్థుల జాబితా పొందుపరిచారని చెప్పారు. తమ ధ్రువీకరణ పత్రాల పరిశీలన కోసం శుక్రవారం నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పరిశీలన చేయించుకోవాలని సూచించారు.

న్యాయం జరిగింది: మహ్మద్ షరీఫ్, కరివిరాల



డీఎస్సీ పరీక్షకు హాజరై కొలువుకు అవసరమైన మార్కులు సాధించినా.. డీఈడీ అభ్యర్థులకు ఎస్జీటీ పోస్టులు కేటాయించడంతో చివరి నిమిషంలో తీవ్ర అన్యాయం జరిగింది. 15 ఏళ్లుగా సుదీర్ఘ పోరాటం చేశాం. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని ఎట్టకేలకు 48 ఏళ్ల వయస్సులో కొలువుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

ఆశ వదులుకున్నా: నాగరాజు, వెంకట్రాంపురం



ఎంఏ, బీఈడీ పూర్తి చేశాను. డీఎస్సీలో చివరి నిమిషంలో ఉద్యోగం చేజారింది. అప్పటి నుంచి ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రభుత్వ కొలువు రాలేదు. చేసేది లేక ఇంటర్‌నెట్ సెంటర్ ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాను. న్యాయస్థానం తీర్పుతో ప్రభుత్వం కనీసం కాంట్రాక్టు పద్ధతిలోనైనా కొలువులకు ఎంపిక చేసినందుకు ఆనందంగా ఉంది.

నట్టల నివారణ ఏమాయె..!

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు లేక అనారోగ్యం బారిన పడుతున్నాయి. ప్రతి సంవత్సరం ప్రభుత్వం సరఫరా చేయాల్సిన మందులు సరఫరా కావడం లేదు. దీంతో జీవాల పెంపకందారులు ప్రైవేట్‌గా కొనుగోలు చేస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది.

✦ ఉమ్మడి జిల్లాలో 23.21 లక్షల గొర్రెలు, 5.86 లక్షల మేకలు ఉన్నాయి. వాటికి నట్టల నివారణకు ఏటా రెండు సార్లు పశుసంవర్ధక శాఖ అధికారులు నట్టల మందులను జీవాలకు వేస్తారు. ప్రభుత్వం గత రెండేళ్లుగా వాటిని సరఫరా చేయడం లేదు. వానాకాలం సీజన్ ప్రారంభంలో ఆ తర్వాత సీజన్ ముగిసి నీరు ఇంకిపోయే దశలో నట్టల వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుంది. నట్టల ముందు వేయడం వల్ల జీవాలు ఆరోగ్యంగా ఉంటాయి.

వచ్చిన వెంటనే వేస్తాం.. జూలకంటి వెంకటరెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి. నల్గొండ

ప్రస్తుతం గొర్రెల, మేకలకు కావాల్సిన నట్టల నివారణ మందులు అందుబాటులో లేవు. ప్రభుత్వం నుంచి సరఫరా కావట్లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి రాగానే పంపిణీ చేస్తాం.

గొర్రెలు, మేకల సంఖ్య..

జిల్లా	గొర్రెలు	మేకలు
నల్గొండ	912625	336182
సూర్యాపేట	779920	140000
యాదాద్రి	628600	110000

కోదాడ

•కోదాడ •హుజూర్‌నగర్

అక్టోబరు 10, 11 తేదీల్లో బండ్ల పండగ

మునగాల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయ అభివృద్ధి కమిటీని గ్రామ పెద్దలు, ప్రముఖుల ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ నూతన అధ్యక్షుడిగా దేవరం వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యలక ప్రతాపరెడ్డి, ఉపాధ్యక్షుడిగా నాగిరెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి మాట్లాడారు. అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆలయంలో అర్చకులు ప్రశాంతాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అమ్మవారి బండ్ల పండగను అక్టోబరు 10, 11 తేదీల్లో జరపనున్నట్లు తెలిపారు.

29న వాలీబాల్ పోటీలు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) 50వ వార్షికోత్సవం సందర్భంగా కోదాడ మండల స్థాయి పాఠశాలల విద్యార్థులకు స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 29న వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు పూర్వ పీడీఎస్‌యూ నాయకులు చిన్ని, నాగిరెడ్డి, ప్రస్తుత నాయకులు గురువారం తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 50363 96030 18889

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? కోదాడలోని నయానగర్‌లో సీసీ రహదారులు గుంతలు పడి, మురుగు కాలువలు లేకపోవడంతో మురుగునీరు రహదారులపైకి వచ్చి దుర్వాసన, దోమల బెడదతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. **-దుర్గాప్రసాద్, కోదాడ**

✔ నిధులు మంజూరు కాగానే మురుగు కాలువలు ఏర్పాటు చేసి, గుంతలను పూడ్చి వేస్తాం. దోమల మందును పిచికారీ చేయిస్తాం.

- రమాదేవి, పుర కమిషనర్

డ్రైవర్ నిర్వాకం.. కాలినడకన విద్యార్థులు



రోడ్డుపై గుంత ఉందని, ముందుకు వెళ్లదని బస్సును మధ్యలో నిలిపివేయడంతో విద్యార్థులు కాలినడకన ఇంటిదారి పట్టిన ఘటన గురువారం నడిగూడెం వద్ద చోటు చేసుకుంది. కోదాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తెల్లబల్లి, రామాపురం మీదుగా నడిగూడెం నుంచి కరివిరాల వరకు రోజూ విద్యార్థులను చేరవేస్తుంది. ఉదయం విద్యార్థులను రామాపురంలో బస్సు ఎక్కించుకుని వస్తున్న సమయంలో నడిగూడెం గ్రామం వెలుపల రహదారిపై గుంత పడిందని, బస్సు వెళ్లదని విద్యార్థులను అక్కడే దింపి వెళ్లిపోయింది. దీంతో విద్యార్థులు వచ్చిపోయే వాహనాలను పట్టుకుని ఇంటిదారి పట్టారు. డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

- నడిగూడెం, న్యూస్‌టుడే

మునిగిన ప్రతి ఎకరాకూ సాయం

ముఖాముఖి

కోదాడ, హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: భారీ వర్షం, వరదల వల్ల కాల్వ కట్టలు తెగిపోవడంతో వరి పంట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరదలకు విద్యుత్ నియంత్రికలు నేలకొరగడంతో బోర్లు, బావుల కింద సాగు చేసిన పొలాలు ఎండిపోయాయి. రుణమాఫీ కాక చాలా మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంటల నమోదు, రైతు వేదికల్లో నిర్వహణ తదితర అంశాలపై కోదాడ, హుజూర్‌నగర్ వ్యవసాయ శాఖ అదనపు వ్యవసాయ సంచాలకుల(ఏడీఏ)తో ముఖాముఖి..

ప్రశ్నలు: 1. వరదల కారణంగా నియోజకవర్గంలో పంట నష్టం ఎలా ఉంది?

2. కాల్వ నీళ్లు రాక, విద్యుత్తు సరఫరా లేక నియోజకవర్గంలో ఎండిన పంటల వివరాలు?

3. నష్టపరిహారం ఎలా అందిస్తున్నారు?

4. వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో వెళ్లి పంటల నమోదు చేయట్లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై మీ సమాధానమేంటి?

5. రుణమాఫీ కాని వారి పరిస్థితి ఏంటి?

6. రైతు వేదికల్లో పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించట్లేదనే ఆరోపణలున్నాయి. మీరేమంటారు?



ఎల్లయ్య, కోదాడ

1.జ: వరదల కారణంగా నియోజకవర్గంలో సుమారు 5 వేల ఎకరాల వరకు మునిగిపోయింది. వారందరికీ నష్టపరిహారం అందిస్తాం.

2.జ: సుమారు 100 ఎకరాల వరకు పూర్తి స్థాయిలో ఎండిపోగా, 1,200 పైగా ఎకరాల వరకు నీరు సరైన సమయంలో లేక వరి వాడిపోయింది.

3.జ: వరదల కారణంగా వర్షాధార పంటలకు రూ.8,500, వరి పంటకు రూ.17,000 ప్రతి హెక్టార్‌కు అందిస్తాం. ఎండిన పంటలపై సాయం అందించే విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది.

4.జ: ఏఈవో, ఏవోలు క్షేత్రస్థాయిలో పంటలను చూసి వివరాలు నమోదు చేస్తున్నారు. నియోజకవర్గంలో వరి 1,26,128 ఎకరాలు, పత్తి 10,648 ఎకరాలు సాగు చేశారు.

5.జ: ఇప్పటి వరకు నియోజకవర్గంలో 33,820 మంది రైతులకు రుణమాఫీ అయింది. మిగతా వారికి త్వరలోనే మాఫీ అవుతుంది.

6.జ: రైతు వేదికల్లో ప్రతి మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంతో శాస్త్రవేత్తలు రైతుల సందేహాలు నివృత్తి చేస్తున్నారు. శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నాం.



రవికుమార్, హుజూర్‌నగర్

1.జ: వరదల వల్ల నియోజకవర్గంలో పంటలు నీట మునిగి, ఇసుక మేటలు వేసి 4,838 ఎకరాలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించాం.

2.జ: కాల్వ నీరు రాక, విద్యుత్తు లేక నియోజకవర్గంలో పంటలు ఎండిపోలేదు. నష్టం జరగలేదు.

3.జ: నష్టపరిహారం ఎంత చెల్లించాలనే దానిపై ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు లేవు.

4.జ: పంటల నమోదు కార్యక్రమం వ్యవసాయ విస్తరణాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి నమోదు చేస్తారు.

5.జ: రుణమాఫీ కాని రైతులు వెంటనే సమీపంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయించుకోవాలి.

6.జ: రైతు వేదికలలో ప్రతి మంగళవారం రైతులకు పంటలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. రైతులు అందరూ ఉపయోగించుకోవాలని కోరుతున్నాం.

ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే

మోతె, న్యూస్‌టుడే: నిత్యం పేద, పీడిత ప్రజల సమస్యలపై పోరాడే ఏకైక పార్టీ సీపీఎం అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు అన్నారు. గురువారం రావిపహాడ్ గ్రామంలో మహాసభలకు హాజరై మాట్లాడారు. పార్టీ జెండా ఆవిష్కరించి అమరులకు నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో భారాసకు చెందిన గురవయ్యను సీపీఎం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల కార్యదర్శి గోపాల్‌రెడ్డి, మల్లయ్య, స్వరాజ్యం, పోతయ్య, లచ్చీరాం, మల్సూర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పనులు



కేఆర్సీపురం వద్ద ఏర్పాటు చేస్తున్న ఇసుక బస్తాలు

నడిగూడెం, న్యూస్‌టుడే: ఎడమ కాల్వకు గండి పడిన చోట కాల్వ కట్టకు రక్షణగా ఇసుక బస్తాల ఏర్పాటు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గురువారం కాల్వ కట్టకు 5 మీటర్ల ఎత్తు వరకు ఇసుక బస్తాలు అమర్చారు. కాల్వలో నీటి ప్రవాహం ఉద్ధృతంగా కొనసాగుతోంది. పాలేరు వరకు సాగర్ కాల్వలో నీటి విడుదల కొనసాగుతోంది. గండి పడిన చోట కాల్వ కట్ట పైవరకు రక్షణగా ఇసుక బస్తాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వరద బాధితులకు సాయం

కోదాడ న్యూస్‌టుడే: కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో వరద బాధితులకు సాయం అందించేందుకు రాష్ట్ర రెడ్ క్రాస్ సంస్థ ముందుకొచ్చింది. వరద బాధితులకు అందించే కిట్లు గురువారం కోదాడ ఆర్డీవో కార్యాలయానికి చేరాయి. రెండు నియోజకవర్గాలకు సుమారు 280కి పైగా కిట్లు వాహనంలో రాగా ఆర్డీవో ఆధ్వర్యంలో భద్రపరిచారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కిట్లు పంపిణీ చేస్తామని తెలిపారు.



వరద సాయం కిట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్

చిలుకూరు: నారాయణపురంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఆవాసం కోల్పోయిన బాధితులకు కోదాడ మున్సిపల్ కౌన్సిలర్ షేక్ ఇమామ్‌ఏ-షఫీ అందజేసిన సరకులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

కోదాడ: వరదల సమయంలో తీవ్రంగా నష్టపోయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదని వరద బాధితులు బుధవారం ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండా అంతంత మాత్రంగానే బాధితుల వివరాలు సేకరించి, నిజమైన అర్హులను గుర్తించలేదన్నారు. ఇన్‌ఛార్జి ఆర్డీవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ క్షేత్రస్థాయిలో పర్యటించి, నష్టపోతే సాయం అందిస్తామన్నారు.



ధర్నా చేస్తున్న బాధితులు



మేళ్లచెరువులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని ఐడీసీఎస్ సీడీపీవో పారిజాత, తహసీల్దారు జ్యోతి, ఎంపీడీవో అజ్గర్ అలీ, ఎంపీవో గోపి అన్నారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారం, ఆరోగ్యం గురించి మేళ్లచెరువు ఉమ్మడి మండల స్థాయిలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు.

ప్రతి సహాయకుడు సుశిక్షితుడవ్వాలి

మోతె, న్యూస్‌టుడే: గ్రామాల్లో మంచినీటి సరఫరా వ్యవస్థను నిర్వర్తించే ప్రతి మంచినీటి సహాయకుడు(వాటర్ మాన్) సుశిక్షితుడు కావాలని గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం ఈఈ అరుణాకర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో మంచినీటి సహాయకులకు గురువారం ఏర్పాటు చేసిన నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. భారత ప్రభుత్వం చేపట్టిన నల్ జల్ మిత్ర కార్యక్రమంలో మంచినీటి సరఫరా వ్యవస్థలో ఏర్పడే అవాంతరాలను వాటర్ మెన్ స్వయంగా పరిష్కరించేలా ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. మోతె, చివ్వెంల మండలాల పరిధిలో ప్రతి పంచాయతీ నుంచి ఒకరిని ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నారు. పైపులైను లీకేజీలు, చేతిపంపు, బోరుబావి మరమ్మతులు, త్రీఫేజ్, సింగిల్ ఫేజ్ మోటార్ల మరమ్మతులు, నీటి నాణ్యత తదితరాలపై నైపుణ్యం సాధించేలా వీరికి ఈ నాలుగు రోజులపాటు శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. పల్లెల్లో ప్రతి ఇంటికి తలకు వంద లీటర్ల సురక్షితమైన, క్రమమైన, నిరంతరాయంగా తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ఈ శిక్షణ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు వివరించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఆంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పాండు, ఏఈలు మణికంఠ, రుత్విక్ పాల్గొన్నారు.



మోతె: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఈ అరుణాకర్‌రెడ్డి

విద్యార్థుల సమస్యలపై సమరశీల పోరాటాలు

మఠంపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థుల సమస్యలపై పీడీఎస్‌యూ గత 50 సంవత్సరాలుగా సమరశీల పోరాటాలు కొనసాగిస్తూనే ఉందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎం. చందర్‌రావు తెలిపారు. పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం మఠంపల్లిలో గోడ పత్రికలు ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. ఇప్పటి వరకు నూతన ప్రజాస్వామిక వ్యవస్థ కోసం బలమైన విప్లవ ఉద్యమాలను నడిపిందన్నారు. శాస్త్రీయ విద్యా సాధనే లక్ష్యంగా విద్యార్థులను కూడగట్టిన ఘనత తమదేనని వెల్లడించారు. అక్టోబరు 24న ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో అర్ధశతాబ్ది ఉత్సవాలు జరుగుతాయని, పూర్వ, ప్రస్తుత విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఉదయ్, రాకి, అభిషేక్, గౌతం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్, ట్రాక్టర్ పట్టివేత

మోతె, న్యూస్‌టుడే: మండలంలోని పాలేరు వాగులో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు ఉక్కుపాదం మోపారు. గురువారం వాగు పక్కనున్న ఉర్లుగొండ, నర్సింహాపురం, రావికుంట తండా, అన్నారిగూడెం గ్రామాల పరిధిలో తహసీల్దార్ సంఘమిత్ర, ఎస్సై యాదవేందర్‌రెడ్డితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రావికుంటతండాకు చెందిన ఇసుక నింపుకొని వెళుతున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం నర్సింహాపురం, ఉర్లుగొండ, రావికుంటతండా గ్రామాల్లో నిల్వ చేసిన ఇసుక డంపులను గుర్తించి సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక సుమారు 30 ట్రాక్టర్లు ఉంటుందని వివరించారు. గతంలోను నర్సింహాపురం తదితర వాగు పక్కనున్న గ్రామాల్లో సీజ్ చేసిన ఇసుక నిల్వలను పరిశీలించారు. మండలంలోని వాగుల నుంచి ఇసుక రవాణాపై నిషేధం ఉన్నందున అక్రమంగా తరలిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్తు తీగల చోరీ.. నిందితుల పట్టివేత

కోదాడ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్ తీగలను చోరీ చేసిన ఇద్దరు వ్యక్తులను గురువారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. మండల పరిధిలోని తొగర్రాయి విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో సుమారు రూ.1.20 లక్షల విలువైన విద్యుత్ తీగలు చోరీకి గురైనట్లు గ్రామీణ ఏఈ శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానం ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు తీగలను స్వాధీనం చేసుకున్నారు. ఇరువురి నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఎస్సై అనిల్‌రెడ్డిని వివరణ కోరగా విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అమరుల ఆశయాలు సాధిస్తాం

గరిడేపల్లి, న్యూస్‌టుడే: అమరుల ఆశయాలు సాధిస్తామని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్‌కుమార్ అన్నారు. వెల్దండలో అరుణోదయ డివిజన్ కమిటీ సభ్యుడు కొమరయ్య సంతాపసభలో మాట్లాడారు. కొమరయ్య పేదల కోసం చేసిన పోరాటం మరువలేనిదన్నారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా, డివిజన్ నాయకులు లక్ష్మయ్య, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, సైదులు పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ క్రీడల్లో సత్తా

మఠంపల్లి, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ డివిజన్ స్థాయి ఎస్జీఎఫ్ క్రీడల్లో మఠంపల్లి మండలానికి చెందిన విద్యార్థులు వాలీబాల్, ఖోఖో పోటీలలో సత్తా చాటి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. కరక్కాయలగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 24, 25 తేదీలలో నిర్వహించిన ఈ ఆటలలో ఇక్కడి వివిధ పాఠశాలల బాలబాలికలు అండర్ 17, 14 విభాగాల్లో ప్రతిభ చాటడమే కాకుండా వాలీబాల్‌కు ఇదే మండలం నుంచి ఏడుగురు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.

జీవోను సవరించి ప్రాథమిక పాఠశాలలను పరిరక్షించాలి

అనంతగిరి, న్యూస్‌టుడే: జీవో నం.25ను సవరించి ప్రాథమిక పాఠశాలలను పరిరక్షించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్షురాలు సంధ్యారాణి అన్నారు. గురువారం గొండ్రియాల జడ్పీ ఉన్నత పాఠశాలలో తపస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎన్‌ఎంఎంఎస్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సుధాకర్, ఫణి, తదితరులు పాల్గొన్నారు.



గొండ్రియాల పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న తెలంగాణ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షురాలు సంధ్యారాణి

కోదాడ: పట్టణంలోని తమ్మర పాఠశాలలో తెలంగాణ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షురాలు సంధ్యారాణి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రైతులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి

ఎక్స్ వేదికగా కేటీఆర్

చిలుకూరు, న్యూస్‌టుడే: చిలుకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో పలు కారణాలతో సంఘానికి చెందిన 40 మంది సభ్యులకు రుణమాఫీ కాలేదు. దీంతో వారు సంఘం కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై మాజీ మంత్రి కె.తారక రామారావు ఎక్స్(ట్విట్టర్) వేదికగా స్పందించారు. రైతులతో సీఐ ప్రవర్తించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తక్షణమే రైతులకు క్షమాపణ చెప్పాలని, ఆమెను సస్పెండ్ చేయాలని, అలాగే ప్రభుత్వం కూడా రైతులకు క్షమాపణ చెప్పి వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

చాకలి ఐలమ్మ జయంతి

చాకలి ఐలమ్మను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా పలుచోట్ల ఆమెకు నివాళి అర్పించారు. తెలంగాణ సాయుధ రైతాంగ సాయుధ పోరాటంలో ఆమె పాత్రను గుర్తు చేసుకున్నారు. **- న్యూస్‌టుడే బృందం**



కోదాడ: ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న రజక సంఘ నాయకులు, ఉద్యోగులు

శ్రమదానం చేసి.. శుభ్రపరచి

గరిడేపల్లి, నేరేడుచర్ల,: స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా గరిడేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ద్విచక్రవాహనాలతో ప్రదర్శన నిర్వహించారు. నేరేడుచర్లలో ర్యాలీ చేశారు.

హుజూర్‌నగర్: ఎస్సెస్పీ క్యాంపు ఉన్నత పాఠశాలలో పురపాలక సంఘం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రమదానం చేశారు.



కోదాడ: పారిశుద్ధ్య కార్మికులతో కలిసి శ్రమదానం చేస్తున్న పుర కమిషనర్ రమాదేవి

కోదాడ: పలు వీధుల్లో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పుర సిబ్బంది శ్రమదానం చేశారు.

చిలుకూరు: తహసీల్దారు, మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో శ్రమదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

టీఎస్ యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: టీఎస్ యూటీఎఫ్ హుజూర్‌నగర్ మండలశాఖ నూతన కమిటీ ఎన్నిక జిల్లా కార్యదర్శి దామోదర్ ఆధ్వర్యంలో గురువారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా ఎ.రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వి.రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్‌రెడ్డి, జ్యోతి ఎన్నికయ్యారు.



ఎ.రాజశేఖర్‌రెడ్డి



వి రామకృష్ణ

మఠంపల్లి: టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీని జిల్లా కార్యదర్శి దామోదర్ అధ్యక్షతన మఠంపల్లిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జె.కిరణ్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా ఎం.రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆర్.రామకృష్ణ, జి.స్రవంతి, కోశాధికారిగా ఎం.చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.

రైతులకు పరిహారం అందించాలని ధర్నా

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: వరదల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కి వినతి పత్రం అందించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు, రావుల సత్యం, మండల కార్యదర్శి సింహాద్రి, పట్టణ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిరసన

చిలుకూరు: నల్గొండ జిల్లాలో ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీవో గిరిబాబు, ఎంపీవో జగదీష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మోతె: నల్గొండ జిల్లాలో కార్యదర్శుల సస్పెన్షన్‌పై మండలంలోని పంచాయతీరాజ్ సిబ్బంది గురువారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామ కార్యదర్శులు, ఎంపీడీవో, కార్యాలయ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

మునగాల: నల్గొండ జిల్లాలో మండల అభివృద్ధి అధికారిణి, పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ మునగాలలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీడీవో రమేష్ దీన్ దయాల్, పంచాయతీ కార్యదర్శులు నల్లబాడ్జీలు ధరించి గురువారం నిరసన వ్యక్తంచేశారు. అనంతరం ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్ మాట్లాడారు. ఉద్యోగులపై పని ఒత్తిడి పెంచడం సరిగాదన్నారు.

సినిమాలు	కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:
విష్ణురామ్: దేవర, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్:** దేవర	

సంక్షిప్త సమాచారం

బాధ్యతల స్వీకరణ... మునగాల,: మండల విద్యాశాఖాధికారిగా (ఎఫ్ఏసీ) మునగాల జడ్పీహెచ్ఎస్ గెజిటెట్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు.

మేళ్లచెరువు: మండల నూతన విద్యాధికారిగా మేళ్లచెరువు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాకుమాను వెంకటరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

మఠంపల్లి: ఇన్‌ఛార్జి ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన కె.వెంకటాచారిని ఎస్టీయూ ఆధ్వర్యంలో సన్మానించారు.

కోదాడ పట్టణం: చిలుకూరు ఎంఈవో గురవయ్య నియామకం కావడంతో మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాదిగ ఆధ్వర్యంలో సన్మానించారు.

నేరేడుచర్ల: నేరేడుచర్ల ఎంఈవోగా నియమితులైన దిర్శించర్ల జడ్పీహెచ్ఎస్ హెచ్.ఎం పి.సత్యనారాయణరెడ్డి, లయన్స్ క్లబ్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసిన ఉపాధ్యాయుడు ఎన్.విజయ్‌కుమార్, పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసి పదవీవిరమణ పొందిన ఎన్.కోటిరెడ్డిలకు పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు సన్మానం జరిపారు.

నివాళి.. హుజూర్‌నగర్ గ్రామీణం: హుజూర్‌నగర్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పొలిశెట్టి నరసింహారావు తల్లి పొలిశెట్టి రమణమ్మ(91) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. రమణమ్మ మృతి పట్ల అసోసియేషన్ నాయకులు శ్రద్ధాంజలి ఘటించి నరసింహారావు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సంతాపం తెలిపారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి రమణమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు.

డిమాండ్.. గరిడేపల్లి: హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు షేక్.యాకూబ్ డిమాండ్ చేశారు. గడ్డిపల్లి రైస్ మిల్ కార్మికుల స్థితిగతులపై సర్వే చేసిన సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యకార్డులు అందించాలని కోరారు.

భ్రూణ హత్యలను నిర్మూలించాలి.. మునగాల: ప్రైవేటు వైద్యశాలలో నిర్వహిస్తున్న లింగనిర్ధారణ, భ్రూణ హత్యలను నిర్మూలించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అన్నారు. కఠినమైన చట్టాలను తీసుకొచ్చినప్పుడే వీటిని సమర్థంగా నిర్మూలించ వచ్చునన్నారు.

ఎన్నిక.. నేరేడుచర్ల: టైలరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా బత్తిని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బి.అంజయ్యని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం ఒక ప్రకటనలో తెలిపింది.

నేత్రదానం.. హుజూర్‌నగర్ గ్రామీణం: హుజూర్‌నగర్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పొలిశెట్టి నరసింహారావు తల్లి రమణమ్మ మరణించడంతో ఆమె నేత్రాలను దానం చేశారు. నరసింహారావు కోరిక మేరకు హుజూర్‌నగర్ వాసవి క్లబ్ సభ్యులు గురువారం ఖమ్మం నేత్రనిధి వారిని సంప్రదించి నేత్రాల సేకరణకు రప్పించారు. వారు నేత్రాలను సేకరించారు.

ఫిర్యాదు.. హుజూర్‌నగర్ గ్రామీణం: హుజూర్‌నగర్‌లో దేవర సినిమా బెనిఫిట్ షో టికెట్లు బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని, దీనివల్ల ఎన్టీఆర్ అభిమానులకు ఆర్థిక భారం పడుతుందని కంటు నాగరాజు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. బ్లాక్ మార్కెట్ దందాను ఆపాలని కోరారు.

అవగాహన.. మునగాల: విద్యార్థులు పరీక్షలంటే మానసిక ఒత్తిడికి లోను కావద్దని మానసిక వైద్యురాలు స్రవంతి అన్నారు. ఆదర్శ పాఠశాలలో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెంటల్ హెల్త్ అవేర్‌నెస్‌పై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

సంఘ సేవలను సద్వినియోగం చేసుకోండి

తుంగతుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు కోరారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన మహాసభ సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. మండలంలో బ్యాంకుల కంటే తమ సంఘంలోనే రైతులందరికీ రుణమాఫీ అయ్యిందని చెప్పారు. 830 మంది రైతులకు రూ.5.8 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయని పేర్కొన్నారు. రూ.32.33 కోట్ల వార్షిక టర్నోవర్ సాధించామన్నారు. కార్యక్రమంలో సీఈవో వందనం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:
? సూర్యాపేటలోని జమ్మిగడ్డ రోడ్డు నం.3లో విషసర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయి. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో విషసర్పాలకు నిలయంగా మారాయి. వెంటనే చర్యలు చేపట్టాలి. – శ్రీనివాస్, జమ్మిగడ్డ
✔ సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. – శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
సూర్యాపేట: 9154395978
తుంగతుర్తి: 80085 74450

భానుపురి, న్యూస్‌టుడే:
? సూర్యాపేటలోని బాలాజీనగర్‌కు వెళ్లే దారిలో విద్యుత్తు నియంత్రిక చుట్టూ రక్షణ కంచె లేదు. ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. – శ్రీకాంత్, సూర్యాపేట
✔ రక్షణ కంచె ఏర్పాటు చేయిస్తాం. – శ్రీనివాస్, డిస్కం డీఈ, సూర్యాపేట.

జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం: జూలకంటి

నూతనకల్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం స్వార్థపూరితంగా తీసుకువస్తున్న జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. నూతనకల్ మండలం చిల్పకుంట్లలో ఆ పార్టీ గ్రామశాఖ కార్యదర్శి బొజ్జ శ్రీను అధ్యక్షతన గురువారం నిర్వహించిన సీపీఎం గ్రామ మహాసభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యాదగిరిరావు, నాయకులు పులుసు సత్యం, కందాల శంకర్‌రెడ్డి, అల్లిపురం సంజీవరెడ్డి, తొట్ల అచ్చయ్య, కందాల కృష్ణారెడ్డి, తిరుమలేష్ పాల్గొన్నారు.



చిల్పకుంట్లలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: రైతులకు రుణమాఫీ, రైతు భరోసా నిధులను విడుదల చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండా వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని నెమ్మికల్‌లో గురువారం నిర్వహించిన సీపీఎం గ్రామశాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. నూతన శాఖ కార్యదర్శులుగా దండా శ్రీనివాసరెడ్డి, ఎడ్ల నవనీతను ఎన్నుకున్నారు. బెల్లంకొండ వక్రయ్య, గంపల యల్లయ్య, కనకయ్య, విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్దిరాల: ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు పర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని మామిండ్లమడవలో సీపీఎం మహాసభ హాజరై మాట్లాడారు. మండల కార్యదర్శి బల్లెపల్లి భాస్కర్, కొంపెల్లి నాగయ్య, ఏడుకొండలు, జాజుల్, పున్నమ్మ, చంద్రయ్య పాల్గొన్నారు.


నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

నూతనకల్(గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని దిర్శినపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 33 కేవీ ఇంటర్‌లింక్ లైన్ మరమ్మతులో భాగంగా శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంటు సరఫరాలో అంతరాయం కలుగుతుందని డిస్కం ఏఈ ప్రణయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

చెత్తను పోగేసి.. శుద్ధి మరచి

☛ పల్లెల్లో నిరుపయోగంగా కంపోస్ట్ షెడ్లు

పల్లెప్రగతి కార్యక్రమం కింద గ్రామాల్లో పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపొందించి పంచాయతీలకు ఆదాయం సమకూర్చడానికి మన వ్యర్థాల నిర్వహణ కంపోస్టు షెడ్లను రెండేళ్ల క్రితం గత ప్రభుత్వం నిర్మించింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఒక్కో షెడ్డుకు రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షల ఖర్చు చేసి నిర్మించారు. ప్రతి గ్రామ పంచాయతీ శివారులో సర్కారు స్థలాల్లో ఏర్పాటు చేశారు. చాలా గ్రామాల్లో లక్ష్యం నెరవేరకపోవడంతో నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి. కంపోస్టు షెడ్డు అరలు ముళ్లచెట్లతో దర్శనమిస్తున్నాయి.
– జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే:



అర్వపల్లిలో గ్రామ పంచాయతీ కంపోస్ట్ షెడ్

చర్యలు తీసుకుంటాం

– నారాయణరెడ్డి, ఇన్‌ఛార్జి డీపీవో

గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్ట్ ఎరువులు తయారు చేస్తున్నాం. నిర్వహణ చేయలేని గ్రామాలను సందర్శించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

నియోజకవర్గంలో పరిస్థితి ఇలా..

☛ జాజిరెడ్డిగూడెంలో 17 గ్రామ పంచాయతీల్లో కంపోస్ట్ షెడ్లను నిర్మించారు. చాలా గ్రామాల్లో నిర్వహణ మరిచారు. తడి, పొడి చెత్త నుంచి ఎరువులు తయారు చేసిన దాఖలాలు లేవు.

☛ తుంగతుర్తిలో డంపింగ్ యార్డుల వద్ద తినుబండారాలు ఉండటంతో కోతులు గుంపులుగా వస్తున్నాయి. పక్కనే వరి, పత్తి చేనుల్లోకి వెళ్లి పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. పంట పొలాలకు దూరంగా డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

☛ మద్దిరాలలో 14 డంపింగ్ యార్డులున్నప్పటికీ చాలా గ్రామాల్లో నిర్వహణ లోపంతో వినియోగంలోకి రావడం లేదు.

☛ నాగారం, తిరుమలగిరి, నూతనకల్ మండలాల్లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కంపోస్ట్ షెడ్‌లు చాలా వరకు నిరుపయోగంగా ఉన్నాయి.

నిర్వహణ లోపం

ప్రజలు వీధుల్లో చెత్తాచెదారం పడేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేయడానికి ఇంటింటికీ డబ్బాలు పంపిణీ చేశారు. వీటిని సేకరించడానికి పంచాయతీని బట్టి ట్రాక్టరు, మినీ వ్యాను కొనుగోలు చేశారు. తడి, పొడి వ్యర్థాలను వేయడానికి ట్రాలీని రెండు భాగాలుగా వేరు చేయడానికి అడ్డంగా రేకు పెట్టారు. చాలా గ్రామాల్లో ఆ రేకును తొలగించారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో పారబోస్తున్నారు, శుద్ధికి చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా కంపోస్ట్ షెడ్‌లోని తడి, పొడి, ప్లాస్టిక్ సీసాలు, ఇతర వ్యర్థాలు, గాజు, పాత పేపర్లు, పుస్తకాలు, ఇనుము అరలు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి.

తడి, పొడి చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చి మొక్కల పెంపకానికి వినియోగించాల్సి ఉంది. ఈ పనులు చేసేవారు లేక అరలలో పిచ్చి మొక్కలు మొలిచాయి. చెత్తను వేరే చేసి ప్లాస్టిక్, ఇనుము, అట్టలు, పాత పేపర్లు, పుస్తకాలు, గాజు సీసాలను విక్రయిస్తే పంచాయతీలకు ఆదాయం వస్తుంది. ఆ దిశగా చర్యలు తీసుకునే వారు కరవు.



సేంద్రియ ఎరువులు తయారు చేసే తడి, పొడి చెత్త అరలు ఇలా..

మహాగర్జన జయప్రదం చేయాలని పిలుపు

సూర్యాపేట (మహాత్మాగాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి మహాగర్జనకు వేలాది మంది విద్యార్థులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో భానోత్ వినోద్, అక్కినేపల్లి వినయ్, శ్రవణ్, మనోజ్, దినేష్, వీరబాబు, గాయత్రి, జ్యోతి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి సైబర్ మోసాలు, మత్తు మందు వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన పెంచుకోవాలని ఆత్మకూర్(ఎస్) ఎస్సై సైదులు కోరారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పోలీసు కళాజాత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.వెంకన్న, పోలీసు సిబ్బంది వెంకటేశ్వర్లు, మధుసూదన్, కళాబృందం ఇన్‌ఛార్జి యల్లయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు గురువారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో..)

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	3189	1439
జైశ్రీరాం	3411	2156
ఐఆర్-64	2046	2006
హెచ్ఎంటీ	2919	2629
కందులు	9324	5065
పెసర	7555	4059
వేరుసెనగ	8021	2356
మినుములు	3015	3015
బొబ్బర్లు	6605	5019
జొన్నలు	2652	2652

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే సామేల్



గురుకుల పాఠశాలలో ఫోన్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బాలెంలలోని జాజిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? వసతులు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటలను పరిశీలించారు. జాజిరెడ్డిగూడెం మండలంలో పాఠశాల భవనం నిర్మాణం కోసం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. కాసర్లపహాడ్‌లో ఏడెకరాల స్థలం ఉందని అధికారులకు ఫోన్‌లో వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణ, కాంగ్రెస్ నాయకులు సుంకరి జనార్దన్, గుడిపెల్లి మధుకర్ రెడ్డి, బైరబోయిన మహారాజు, తల్లిదండ్రుల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరస్వామి పాల్గొన్నారు.

28న అక్షర ప్రతిభా పురస్కారాల ప్రదానం

సూర్యాపేట (మహాత్మాగాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: సమాజ సేవే లక్ష్యంగా పని చేస్తున్న వారిని గుర్తించి ప్రోత్సహిస్తున్నట్లు అక్షర ఫౌండేషన్ ఛైర్మన్ యాస రాంకుమార్ పేర్కొన్నారు. స్థానిక అక్షర ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రంగంలో ప్రతిభావంతులను గుర్తించి పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 28న అక్షర పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉప్పు నాగయ్య, ఉపేంద్రాచారి, బత్తుల ఉపేందర్, నరాల తిరుమలరెడ్డి, కాళిదాసు, యూసుఫ్, నజీర్ బాషా, అప్పారావు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం



సూర్యాపేటలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఆ సంఘ నాయకులు

సూర్యాపేట (మహాత్మాగాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: సమ సమాజ స్థాపనే పీడీఎస్‌యూ ధ్యేయమని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల కుమార్ పేర్కొన్నారు. పీడీఎస్‌యూ 50 వసంతాల భారీ ప్రదర్శనను పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డు నుంచి కొత్త బస్టాండ్ మీదుగా గురువారం నిర్వహించారు. విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

స్టీల్ వాటర్ బాటిళ్ల పంపిణీ

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలోని రామన్నగూడేనికి చెందిన నల్లెడ మల్లారెడ్డి మనవడు జశ్వంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గురువారం స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లు, చేతి రుమాళ్లు పంపిణీ చేశారు.

కరపత్రాలు విడుదల

నాగారం, న్యూస్‌టుడే: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) అర్ధ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 30న తిరుమలగిరిలో నిర్వహించనున్న డివిజన్ సభకు సంబంధించిన కరపత్రాలను పసునూరు ఆదర్శ పాఠశాలలో గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు జక్కుల సుధాకర్, బానోత్ యాకన్న, లక్ష్మణ్, గణేశ్, మహేశ్ పాల్గొన్నారు.

'పేట' ప్రభుత్వ వైద్యుడికి ఉస్మానియాలో కాలేయ మార్పిడి

ఉస్మానియా ఆసుపత్రి, న్యూస్‌టుడే: జీవన్మృతుడి నుంచి సేకరించిన అవయవాల ద్వారా ఇద్దరికి కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తిచేసినట్లు ఉస్మానియా వైద్యకళాశాల ప్రిన్సిపల్ డా.నరేందర్‌కుమార్ తెలిపారు. గురువారం ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డా.రాకేశ్ సహాయ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడారు. నల్గొండ జిల్లాకు చెందిన డా.రవి సుందర్(46) సూర్యాపేటలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో జనరల్ సర్జరీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈయన ఉస్మానియా వైద్యకళాశాలలో ఎంబీబీఎస్, ఎంఎస్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థి. గత నెలలో హఠాత్తుగా వైరల్ ఇన్‌ఫెక్షన్, తీవ్ర అనారోగ్యం పాలవడంతో అతన్ని గత నెలలో కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. కాలేయం పూర్తిగా దెబ్బతినడంతో మార్పిడి చేయాలని వైద్యులు నిర్ధారించారు. కుటుంబీకుల రక్త నమూనాలు సరిపోలేదు. అదే సమయంలో మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలానికి చెందిన గుంత చెన్నయ్య(25) గత నెల 26న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయాలపాలై చికిత్స పొందుతూ జీవన్మృతి(బ్రెయిన్ డెత్)కు గురయ్యాడు. అతని తండ్రి గోపాల్ అంగీకారంతో చెన్నయ్య శరీరంలో నుంచి సేకరించిన కాలేయాన్ని డా.రవి సుందర్‌కు అమర్చి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ చెప్పారు. కోలుకున్న అతన్ని గురువారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసి ఇంటికి పంపించినట్లు చెప్పారు. రూ.40 లక్షల ఖర్చయ్యే చికిత్సను ఆరోగ్యశ్రీ సహకారంతో ఉచితంగా చేసినట్లు డా.సీహెచ్.మధుసూదన్ తెలిపారు.

ఆటలతో మానసికోల్లాసం

చివ్వెంల, న్యూస్‌టుడే: వృద్ధులు తమకు అనువుగా ఉండే ఆటలాడుతూ మానసికోల్లాసం పొందాలని జిల్లా సంక్షేమాధికారి నరసింహరావు అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలో గల దురాజ్‌పల్లి వద్దనున్న వివేకానంద వృద్ధాశ్రమంలో గురువారం మాట్లాడారు. అనంతరం వృద్ధులతో ఆటలను ఆడించి వారిని ఉత్సాహపరిచారు. ఆశ్రమ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, కృష్ణమూర్తి, బండి శ్రీనివాస్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

భూతగాదాలో ఇద్దరు వ్యక్తుల రిమాండ్

మద్దిరాల, న్యూస్‌టుడే: ఇటీవల మండలకేంద్రంలో భూ ఘర్షణలో భాగంగా ఆస్తులు ధ్వంసం చేసిన ఘటనలో ఇరువురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.వీరన్న గురువారం ఠాణాలో తెలిపారు. సోమవారం రాత్రి జరిగిన ఘర్షణలో గ్రామానికి చెందిన నవిళ్ల మల్లారెడ్డి ఇంటిని, వల్లపు వెంకన్నకు చెందిన వాహనాలకు నిప్పు పెట్టిన కేసులో వల్లపు రమేష్, వల్లపు అవిలయ్యలను రిమాండ్‌కు తరలించామన్నారు.

దుండగుల హల్‌చల్

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్‌లో పల్లా వెంకటరెడ్డి ఇంట్లోకి బుధవారం రాత్రి ఇద్దరు దుండగులు ప్రవేశించి భయభ్రాంతులకు గురిచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు వెంకటరెడ్డి ఇంటి వెనుక నుంచి రాత్రి సుమారు 11 గంటల సమయంలో లోనికి ప్రవేశించారు. రేకులకింద నిద్రిస్తున్న వెంకటరెడ్డి భార్య కళమ్మ, ఆమె తల్లి తంగెళ్ల లక్ష్మమ్మను లేపి వెంకటరెడ్డితో మాట్లాడాలని బెదిరించారు. ఇంట్లో నిద్రిస్తున్న వెంకటరెడ్డిని బయటకు బలవంతంగా తీసుకొస్తుండగా అతని అక్క లక్ష్మమ్మ ఇంట్లోంచి తప్పించుకొని బయటికి వెళ్లి కేకలు వేశారు. చుట్టుపక్కల వారు రావడంతో వచ్చిన దుండగులు పరారయ్యారు. సూర్యాపేట గ్రామీణ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్సై వై.సైదులు రాత్రి గ్రామానికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. కళమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎంఈవోల నియామకం హర్షణీయం



ఏపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు సభ్యత్వం అందిస్తున్న టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పేరం ముత్తయ్య.

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలంలోని మక్తాకొత్తగూడెం, మిడ్తనపల్లి, ఏపూర్, రామోజీతండా, దుబ్బగూడెం, కాశిగూడెం, తుమ్మలపెన్‌పహాడ్, కోటపహాడ్, శెట్టిగూడెం, దాచారం పాఠశాలల్లో గురువారం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పేరం ముత్తయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని మండలాలకు ఎంఈవోలను నియమించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి మల్లారెడ్డి, జిల్లా కౌన్సిలర్ మంచాల శ్యామ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి జిల్లా జానయ్య, తూము శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్: మండలంలోని యడవెల్లి, తాళ్లసింగారం, కొత్తగూడెం, టీక్యాతండా, జాల్‌తండా, హేమ్లాతండా, సోమ్లాతండా, గుండ్లసింగారం గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారినికి టీపీటీఎఫ్ ముందుండి పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముప్పాని కృష్ణారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ సుభాని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణవేణి, పుప్పాల వీరన్న, శ్రీనివాస్, మహేష్, సురేష్, నాగన్న పాల్గొన్నారు.

మద్దిరాల గ్రామీణం: అశాస్త్రీయమైన ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ జీవో నెం.25 ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలి టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముప్పాని కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని గోరెంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హరిజన, ప్రాథమిక పాఠశాలల్లో గురువారం టీపీటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టి మాట్లాడారు. పెండింగ్ బిల్లులు, డీఏ ఇవ్వాలని, పీఆర్సీ ప్రకటించాలని కోరారు. రాష్ట్ర కౌన్సిలర్ సుభాని, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, పొలిశెట్టి శ్రీనివాస్, నాగన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టీపీటీయూ మండల కార్యవర్గం ఎన్నిక

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ యూనియన్(టీపీటీయూ) మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా తుమ్మలపెన్‌పహాడ్ హరిజనవాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వై.సుభాష్‌చంద్రబోసు, ప్రధాన కార్యదర్శిగా నెమ్మికల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బామరు సర్దార్‌సింగ్, మహిళా కార్యదర్శిగా మేనేని మాధవి, కార్యవర్గ సభ్యులుగా బచ్చుపల్లి శంకర్‌రావు, నిమ్మల శ్రీనివాస్ ఎన్నికయ్యారు.



వై.సుభాష్‌చంద్రబోసు



సర్దార్‌సింగ్

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

చివ్వెంల: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో గురువారం ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛ స్వభావం-స్వచ్ఛ సంస్కారం అంటూ నినాదాలు చేశారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో దయాకర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదు

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతున్నట్లు ఆ పార్టీ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ అన్నారు. మండల కేంద్రంలో గురువారం పలువురు మహిళలకు పార్టీ సభ్యత్వాలు అందజేశా. మండల అధ్యక్షురాలు లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేలవాలిన ఆశలు



తుంగతుర్తి మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు వచ్చిన వరి పొలాలు చాలావరకు నేలవాలిపోయాయి. కొన్ని రోజులుగా కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన వరి పైరు కింద పడిపోవడంతో చేతులు కష్టం పోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి సింగారంతండాకు చెందిన గుగులోత్ రమేష్ రెండెకరాల వరి పొలం నేలవాలింది. వరి గొలుసులు రాలిపోయాయి. అధికారులతో సర్వే చేయించి నష్ట పరిహారం ఇప్పించాలని అన్నదాతలు కోరుతున్నారు. – తుంగతుర్తి గ్రామీణం, న్యూస్‌టుడే:

గ్యాస్ బండ... ట్యాంకు నీడే అండ



మండలంలోని భారత్ గ్యాస్ వినియోగదారులకు ప్రతి గురువారం డీలర్లు సూర్యాపేట నుంచి ఆటో సిలిండర్లను తీసుకొచ్చి పంపిణీ చేస్తారు. వినియోగదారులు మండల కేంద్రానికి ఉదయం పది గంటలకు వచ్చి సిలిండర్లను వరసలో పెట్టి వాహనం కోసం ఎదురుచూస్తుంటారు. గురువారం భారీ వర్షం కురవడంతో సిలిండర్లు వరసలో పెట్టి ఇలా నీటి ట్యాంకు కింద నిల్చున్నారు. – తుంగతుర్తి,న్యూస్‌టుడే:

చాకలి ఐలమ్మ జీవితం మహిళలకు ఆదర్శం



ఆత్మకూర్(ఎస్) ఆదర్శ పాఠశాలలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు



వర్ధమానుకోటలోని ప్రాథమిక పాఠశాలలో..

తిరుమలగిరి, న్యూస్‌టుడే: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జీవితం మహిళలకు ఆదర్శమని పుర ఛైర్‌పర్సన్ శాగంటి అనసూయ అన్నారు. గురువారం ప్రభుత్వ కార్యాలయాల్లో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. తిరుమలగిరి పురపాలిక కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.బుచ్చిబాబు, పుర సిబ్బంది అఖిల, రాజు, తదిరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి, తుంగతుర్తి గ్రామీణం: మండల కేంద్రంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో రజక సంఘ నాయకుడు పూసపెల్లి యాదగిరి పాల్గొన్నారు. భారాస కార్యాలయంలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, వెంపటిలో జయంతి నిర్వహించారు. డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, నాయకులు నర్సయ్య, రాజు, మల్లేష్ పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు రమేష్, యాకమల్లు, రుక్మిణి, గణేశ్, కరుణాకర్, విజయనిర్మల, స్వప్న పాల్గొన్నారు.



తుంగతుర్తి: భారాస కార్యాలయంలో..

జాజిరెడ్డిగూడెం: కొమ్మాల గ్రామంలో ఐలమ్మ విగ్రహానికి రజక సంఘ నాయకులు బాసాని లక్ష్మయ్య, సతీష్, ఉపేందర్ నివాళి అర్పించారు.

నాగారం: వర్ధమానుకోట ప్రాథమిక పాఠశాలలో ఐలమ్మ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయిని ఎం.ఆనంద, ఉపాధ్యాయుడు వర్దెల్లి మల్లయ్య, జ్యోతి పూలమాల వేసి నివాళులర్పించారు.



తిరుమలగిరి పురపాలిక కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఛైర్‌పర్సన్ శాగంటి అనసూయ, తదితరులు